కొత్త చట్టాలు అభినందనీయం..

• హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ బి.నర్సింహశర్మ

బంజారాహిల్స్, జూలై 20 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ చట్టాలు బాగున్నాయని.. కొత్త చట్టాలు తీసుకురావడం అభినందనీయమని రాష్ట్ర హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ బి.నర్సింహశర్మ అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం కాలేజీలో అన్‌లాకింగ్ 'కొత్త దిశలు –భారతదేశం యొక్క కొత్త క్రిమినల్ చట్టాలు' అనే అంశంపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు ప్రస్తుతం కొత్త చట్టాలలో ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. జీరో ఎఫ్ఐఆర్‌తో పాటు ఈ–ఎఫ్ఐఆర్‌ను కూడా నమోదు చేసుకునే వెసులుబాటు ఈ చట్టాల్లో కల్పించినట్లు తెలిపారు. ఏండ్ల తరబడి కేసులు సాగకుండా ప్రతి కేసుకు ఒక నిర్దిష్ట సమయాన్ని కేటాయిస్తూ రూపొందించబడ్డాయని తెలిపారు. టెర్రరిస్ట్ కార్యకలాపాలు, ఉద్దేశపూర్వకంగా నేరాలు చేసేవారికి ఇందులో కఠిన శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యంగా హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రస్తుతం సెక్షన్లలో బాధితులను ఆస్పత్రిలో చేర్చి పోలీసులకు సమాచారం ఇచ్చిన వారికి శిక్ష తగ్గుతుందని తెలిపారు. నిర్లక్ష్యంగా వెళ్లిపోయే వారికి కఠిన శిక్షలుంటాయన్నారు.

టెక్నాలజీ సంబంధిత వీడియో, ఆడియో టెక్నికల్ ఎవిడెన్స్‌లకు గతంలో పోలిస్తే ప్రస్తుత చట్టాలలో మంచి ప్రాధాన్యతనిచ్చారని సొలిసిటర్ జనరల్ తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఓయూ లా కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి మాట్లాడుతూ.. కొత్త చట్టాలు పారదర్శకంగా.. సరళతరంగా ఉన్నాయని అన్నారు. ఆయా చట్టాలను సంక్షిప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమాచారి, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వరి పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ బి.నర్సింహశర్మ

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ఎర్రగడ్డ, జూలై 20: డివిజన్‌కు చెందిన 34 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పంపిణీ చేశారు. ఎర్రగడ్డ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి షరీఫ్‌ఖురేషీ నివాసం వద్ద పంపిణీ కార్యక్రమం జరిగింది. బాలానగర్, అమీర్‌పేట రెవెన్యూ మండలాలకు చెందిన అధికారులు శ్రీనివాస్, విజయకుమార్, కిరణ్‌కుమార్, కుమారస్వామి, డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, జావిద్, సయ్యద్‌రసూల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రవీందర్

శంషాబాద్ రూరల్, జూలై 20 : ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శంషాబాద్ మండలం పెద్దగోల్కొండకు చెందిన బోయిని రవీందర్‌ను నియామిస్తు శనివారం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ నియామక పత్రం అందజేశారు.

విద్యుత్ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేయాలి

మణికొండ, జూలై 20: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంబాగ్ డీఈ ఎం.శివశంకర్ సూచించారు. కరెంటు స్తంభాలకు, మోటర్లు, సర్వీస్ వైర్లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు, సిబ్బందికి దగ్గరలోని విద్యుత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ కొత్వాల్‌గూడ అధ్యక్షుడిగా మహేశ్‌యాదవ్

శంషాబాద్ రూరల్, జూలై 20 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ కొత్వాల్‌గూడ అధ్యక్షుడిగా మహేశ్ యాదవ్‌ను నియమించినట్లు జిల్లా నాయకుడు లింగం యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా విజయ్, సురేశ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులుగా సాత్విక్‌గుప్త, గుంటి ప్రవీణ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

భవిష్యత్ తరాలు బాగుండాలంటే మొక్కలు నాటాలి

జూబ్లీహిల్స్,జూలై 20 : భవిష్యత్ తరాలు బాగుండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని బ్యాంక్ ఆఫ్ బరోడా జీఎం రితేశ్‌కుమార్ అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ ప్రథమ పటాలంలో కమాండెంట్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన డీఐజీ సిద్ధిఖీతో కలిసి జీఎం రితేశ్ కుమార్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఓబీ డీజీఎంలు సుధాకర్, ఆదిత్య, ప్రసాద్, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఐజీ సిద్ధిఖీ, కమాండెంట్ మురళీకృష్ణతో కలిసి మొక్కలు నాటుతున్న బీఓబీ జీఎం రితేశ్‌కుమార్

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని వినతి

హిమాయత్‌నగర్,జూలై20: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంక ట్‌రెడ్డిని శనివారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుల గణన చేపట్టిన తర్వాత బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి లట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నగిరి ప్రవీణ్‌కుమార్ పటేల్, శ్రీహరి గౌడ్, భిక్షపతిగౌడ్, అజయ్‌పటేల్, సాయికిరణ్, శ్రీనాథ్, శ్రీనివాస్, రాజుయాదవ్, ప్రశాంత్, రాజేశ్ పాల్గొన్నారు.

ప్రపంచం చూపు.. భారత్ వైపు

• పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి

హిమాయత్‌నగర్, జూలై 20: విదేశీ దురాక్రమణదారుల దాడుల్లో ఎన్నో సంస్కృతులు కనుమరుగైనా భారత్ మాత్రం హిందూ సంస్కృతితో సగర్వంగా నిలిచిందని, దాంతో యావత్ ప్రపంచ దేశాలు మన దేశం వైపు చూస్తున్నాయని పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు. శనివారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ విద్యా సంస్థల 84వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు కళాశాల ప్రాంగణంలో జరిగాయి. జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలనికనుగుణంగా విద్యారంగంలో పోటీతత్వం పెరిగిందన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి వీఎల్ వీఎస్ఎస్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల సమయాన్ని వృథా చేయకుండా ఎంచుకున్న రంగంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కేశవ మెమోరియల్ విద్యాసంస్థల ఉపాధ్యక్షుడు జె.నరసింహారావు, జాయింట్ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి,డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వర రావు, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణగూడలోని కేశవ మెమోరియల్‌లో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి

వర్షపు నీటితో హిమాయత్‌సాగర్ కళ కళ లాడాలి

బండ్లగూడ, జూలై 20 : వర్షాలు సమృద్ధిగా కురిసి హిమాయత్‌సాగర్ నీటితో కళకళలాడాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ అన్నారు. శనివారం హిమాయత్ సాగర్ చెరువుపై ఉన్న కట్టమైసమ్మ ఆలయంలో మేయర్ .. డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి, తదితరులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ వర్షపునీటితో చెరువు నిండుకుండలా ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. కార్పొరేషన్‌కు హిమాయత్ సాగర్ నీరందించేందుకు జలమండలి అధికారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం రాము, ప్రశాంత్‌నాయక్, నాయకులు అస్తాంబిన్ అబ్దుల్లా, టింకూరెడ్డి, ఖాజ, గోపాల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హిమాయాత్‌సాగర్ గేట్ల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న బండ్లగూడ జాగీర్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్

కస్తూర్బా ట్రస్ట్‌కు బ్యాంక్ ఆఫ్ బరోడా చేయూత

బండ్లగూడ, జూలై 20 : బ్యాంక్ ఆఫ్ బరోడా అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కస్తూర్బాగాంధీ ట్రస్ట్‌కు నిత్యావసర యంత్ర సామగ్రిని అందజేశారు. అత్తాపూర్, బండ్లగూడ శాఖలకు చెందిన మేనేజర్లు నరేశ్, స్వరూపరెడ్డి సిబ్బందితో కలిసి శనివారం గ్రైండర్లు, 15 ట్యూబ్‌లైట్లు, ఐదు ఫ్యాన్లను అందజేశారు. అనంతరం ఏర్త్ గ్రీన్ డ్రై కార్యక్రమంలో భాగంగా ట్రస్ట్ అవరణలో మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. బ్యాంకు సిబ్బంది విటోభా, సమత, సౌజన్య, లక్ష్మి, తిరుమలరావు, శ్రీనివాస్‌రావు, కాస్తూర్బా ట్రస్ట్ నిర్వాహకులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్‌కు మొక్కను అందజేస్తున్న కస్తూర్బాగాంధీ ట్రస్ట్ నిర్వాహకులు మూర్తి

మెరుగైన పారిశుధ్యం కోసం పనిచేయాలి

బండ్లగూడ,జూలై 20 : వంద శాతం పరిశుధ్యం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన రాజేంద్రనగర సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్‌ల ఎస్ఎఫ్ ఏలు సిబ్బంది జవాన్లు, అధికారులు డీఈఈ శ్రీనివాస్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఎక్కడా చెత్త లేకుండా చూడాలన్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను తీసుకువెళ్లాలని సూచించారు.

పౌర గ్రంథాలయాల్లో పోస్టులు భర్తీ చేయాలి

సుల్తానాబజార్, జూలై 20: పౌర గ్రంథాలయాల్లో లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ తెలంగాణ గ్రంథాలయ నిరుద్యోగ సంఘం కోరింది. శనివారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో కలిసి వారు వినతి పత్రం అందజేశారు. నిరుద్యోగ అభ్యర్థులు మాట్లాడుతూ.. 35 ఏండ్లుగా పబ్లిక్ లైబ్రరీల్లో లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తున్న నేపథ్యంలో పలు లైబ్రరీల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్–1, గ్రేడ్–2, గ్రేడ్–3, గ్రేడ్– 4 పోస్టులను ప్రకటించాలని కోరినట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న 1000 నుంచి 1500 కు పోస్టులు తగ్గకుండా భర్తీ చేయాలని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జాబ్ క్యాలెండర్‌లో నోటిఫికేషన్ ఇచ్చేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జానయ్య, శంకర్, కట్టయ్య, సాయిలు, వైఎం గిరి, మాధవీలత,శ్రీనివాస్, చంద్రశేఖర్, ధన్‌రాజ్, స్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రంథాలయ నిరుద్యోగ సంఘం అభ్యర్థులు

బీపీఈడీ, డీపీఈడీ పరీక్షా తేదీలు మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న డీఎస్సీ పరీక్ష జరుగనున్న నేపథ్యంలో ఆ రోజు నిర్వహించాల్సిన బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలను తిరిగి వచ్చే నెల 19న నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

వివిధ కోర్సులకు దరఖాస్తులు

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదవ తరగతి అని వివరించారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 31 వరకు అవకాశం ఉందన్నారు. ఇతర వివరాలకు 8309037134, 6305895867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తిరుమల గార్డెన్స్‌లో మొక్కల పంపిణీ

బండ్లగూడ, జూలై 20 : భావి తరాల ఉజ్వల భవిష్యత్‌కు మొక్కలు నాటడం ఎంతో అవసరమని కార్పొరేటర్ పద్మావతిపాపయ్య యాదవ్ అన్నారు.బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తిరుమల గార్డెన్ కాలనీలో ఆమె ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు .ఈ సందర్భంగా పద్మవతి పాపయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజుయాదవ్, వెంకటేశ్ యాదవ్, కార్పొరేషన్ సిబ్బంది ఇమ్రాన్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు బ్రహ్మరెడ్డి, కాలనీవాసులు మల్లారెడ్డి, కేశవ్ పాల్గొన్నారు.

రోడ్లు జలమయం.. వాహనదారుల ఇక్కట్లు

మణికొండ, జూలై 20 : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రధానంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారి, అల్కాపూర్ టౌన్‌షిప్, నెక్నాంపూర్ చింతచెట్టు సర్కిల్, మణికొండ ఆంధ్రాబ్యాంకు సర్కిల్ ప్రాంతాల్లో రహదారులన్నీ దెబ్బతిన్నాయి. పుప్పాలగూడ బీఆర్సీ సమీపంలో రహదారి చుట్టుపక్కల భవనాలు ఎత్తుగా నిర్మించడంతో వర్షపునీరు పోయేందుకు దారులన్నీ మూతపడ్డాయి. దీంతో వర్షపునీరు బయటకు వెళ్లక రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచి కురుస్తున్న వర్షానికి ఈ ప్రాంతంలో వర్షపునీరు పూర్తిగా రోడ్డుపైనే నిలిచిపోయింది. దీంతో దాదాపు గంటపాటు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అదేవిధంగా అనేక కాలనీల్లో ప్రధాన రహదారులు గతుకులమయంగా మారాయని, తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని పలు కాలనీవాసులు అంటున్నారు. ప్రజలే తమ సొంత డబ్బులతో గుంతలను పూడ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ నిధులను వెచ్చించి ప్రజాసమస్యలను పరిష్కరించాల్సిన పాలకవర్గం పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రోడ్లపై వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పుప్పాలగూడ బీఆర్సీ ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

దారి ఇలా.. పోయేదెలా..?

ఖైరతాబాద్, జూలై 20 : నిమ్స్ దవాఖాన ప్రధాన రహదారి నుంచి నిత్యం వందలాది మంది రోగులు, వారి సహాయకులు వచ్చి వెళ్తుంటారు. అయితే గత 24 గంటలుగా కురుస్తున్న వర్షాలకు దవాఖాన ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరు తున్నది. జీహెచ్ఎంసీ సిబ్బంది క్రమబద్ధీకరించకపోవడంతో రోగులు, వారి సహాయకులు ఆ నీటి నుంచే వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

హిమాయత్‌నగర్, జూలై 20: నగరంలో ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టేందుకు వారిని గమ్యాస్థానాలకు చేర్చడంలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకమని ఓల్టా యాప్ చీఫ్ ఎగ్జికూటివ్ ఆఫీసర్ రాజావిక్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ రైడింగ్ యాప్‌ల వల్ల ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని అధిగమించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకే ఓల్టా యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. నగరంలోని 50వేల మంది డ్రైవర్లు ఓల్టా యాప్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోగా నిత్యం 40 వేల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం ఎస్ఓఎస్ విధానాన్ని సంస్థ కల్పిస్తుందన్నారు. సేవా దృక్పథంతో తీసుకువచ్చిన ఈ యాప్‌తో ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా లాభం చేకూర్చే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్‌భాస్కర్, మార్కెటింగ్ మేనేజర్ సాయిరాం, ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం పాల్గొన్నారు.

వానకాలం.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జూబ్లీహిల్స్, జూలై 20 : వర్షాలు ఎడతెరిపిలేకుండా కుర్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. క్రమంతప్పకుండా నీటి నాణ్యతను పరిశీలించాలని జలమండలి డివిజన్–6 జనరల్ మేనేజర్ ఎస్.హరిశంకర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులందరూ పర్యటించాలని.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. శనివారం బంజారాహిల్స్‌లోని సింగాడికుంట, ఉదయ్‌నగర్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నీటిని పరిశీలించి ఏ. 5 పీపీఎం క్లోరిన్ శాతం సాధారణ స్థాయిలో ఉన్నట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రజలు నీటిని వేడి చేసుకుని తాగాలని సూచించారు. రోడ్లపై గుంతలు, మ్యాన్‌హోల్స్ ఉంటే వర్షానికి జాగ్రత్తలు పాటించాలని కోరారు. నీటి సరఫరాలోఫిర్యాదులను 155313 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని కోరారు. జలమండలి డివిజన్–6 లో ఉన్న 135 స్లమ్స్‌లో పక డ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బంజారాహిల్స్ ప్రాంతంలో నీటి నాణ్యతను పరిశీలిస్తున్న జీఎం హరిశంకర్

విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వమే రక్షణ కల్పించాలి

వెంగళరావునగర్, జూలై 20 : విద్యుత్ అధికారులు, సిబ్బందికి రక్షణ కరువైపోయిందని, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలోని యూనియన్ (1535) కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల మోతీనగర్ ప్రాంతంలో విద్యుత్ మీటర్ రీడర్ సాయిగణేశ్‌పై అకారణంగా యువకుడు దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. యూనియన్‌లో ఆర్టిజన్లుగా ఉన్న కార్మికులు, స్వీపర్లు, వాచ్‌మెన్‌లు, హోస్‌కీపర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే. ప్రమోద్‌కుమార్, కే. శ్రీనివాస్, యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఏ వజీర్,కోశాధికారి లింగం, నవీన్, వసంతలక్ష్మి, ఏడుకొండలు, ప్రైవేట్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, బాబ్జి, బాధితుడు సాయిగణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్, శ్రీనివాస్, వజీర్ తదితరులు

బసవతారకం ఆసుపత్రిలో అన్నదానం

బంజారాహిల్స్,జూలై 20 : సూర్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం బసవతారకం ఇండో అమెరికన్ హాస్పటల్‌లో నిరుపేదలకు అన్నదానం చేపట్టారు. హాస్పటల్‌లో చికిత్స కోసం వచ్చే రోగులకు, వారి బంధువులకు ఒక్కరోజైనా కడుపు నింపాలన్న ఆలోచనతో అన్నదానం చేస్తున్నట్లు హెల్పింగ హ్యాండ్స్ ప్రతినిధులు తెలిపారు. వందమందికి పైగా అన్నదానం చేసినట్లు వారు పేర్కొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సామ్రాట్ రాయ్ చౌదరి, జేమ్స్ విగేశ్

ఖైరతాబాద్, జూలై 20 : అవగాహన లోపంతోనే విదేశీ విద్యపై కొందరు విద్యార్థులు వెనక్కి తగ్గుతున్నారని వెబ్ స్టార్ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు సామ్రాట్ రాయ్ చౌదరి తెలిపారు. శనివారం హోటల్ తాజ్‌కృష్ణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇన్‌యూనీ గ్లోబల్ యూనివర్సిటీ సిస్టమ్స్ డైరెక్టర్ జేమ్ విగేశ్, అసోసియేట్ డైరెక్టర్ రాజు దాట్లతో కల